ఫొటోగ్రఫీలో ఎఎఫ్ఎయు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్ర ప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ వారు జూన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి త్రైమాసిక ఫొటోగ్రఫీ పోటీలలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ యూనివర్శిటీ ఫైనల్ విద్యార్థి జి. విల్సన్ 'ఫెస్టివల్ థీమ్ మోనోక్రోమ్' విభాగంలో తీసిన ఛాయ చిత్రం భండారా ఫెస్టివల్‌కు పంపారు. ఆ ఛాయచిత్రానికి రెండవ బహుమతి లభించింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు అయిందని తీసిన ఛాయ చిత్రంకు జాతీయోద్యమానికి అతను కృషికి గుర్తింపుగా జి.విల్సన్ కు ప్రశంసా పురస్కారం దక్కిందని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ విద్యార్థిని అభినందించారు.

అభద్రత నడుమ కెజిబివి

- పిఒ సొంత ఇలాఖాలోనే కన్పించని ప్రహరీ
- కోల్డ్‌స్టోరేజీలో నిర్మాణ పనులు
- ఆందోళనల మధ్య విద్యాభ్యాసం
- నిద్రావస్థలో జిల్లా యంత్రాంగం

కెజిబివిలో అభద్రత రాజ్యమేలుతోంది. ఆర్థిక స్తోమతలేని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయల వ్యయంతో కెజిబివి పాఠశాలను నిర్మించారు. రక్షణ గోడ నిర్మాణ పనుల్ని విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. టిడిపి హయాం నుంచి నేటి వరకు ముచ్చటగా రెండు దఫాలుగా ప్రహరీ నిర్మాణ పనులకు అనుమతులు లభించినప్పటికీ అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. ఇందుకు మండల కెజిబివి, ఎస్ఎస్ఎ జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే కారణమనే వాదన వినిపిస్తోంది. ఎస్ఎస్ఎ పిఒ సొంతఇలాఖాలోని కెజిబివి పాఠశాలకు ఏళ్ల తరబడి ప్రహరీకి నిర్మించలేకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

కెజిబివి పాఠశాల ఆవరణలో సంచరిస్తున్న పందులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

కెజిబివి విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. 2008లో మండల కేంద్రానికి అతి సమీపంలో కోట్లాది రూపాయల వ్యయంతో కెజిబివి పాఠశాలను నిర్మించారు. వందలాది మంది పేద విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కెజిబివికి రక్షణ గోడ (ప్రహరీ) లేకపోవడంతో పందులు, పశువులు, విషపురుగుల సంచారానికి నిలయంగా మారింది. పందుల సంచారం గురించి చెప్పాల్సిన పనేలేదు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందనే ఆందోళన నెలకొంది. కెజిబివి వెనుకభాగాన జగనన్న ఇళ్లకాలనీ నిర్మితమవుతోంది. కాలనీ నిర్మాణ పనుల పేరుతో తాగుబోతుల సంచారం పరిపాటిగా మారింది. ఇటీవల చోటుచేసుకున్న ఓ విద్యార్థిని ఘటనలో ఐదుగురు కిందిస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. అసలు బాధ్యులకు జిల్లా అధికారి రక్షణ లభించిన నేపథ్యంలో ఎటువంటి చర్యలు లేకుండా పోయింది. విద్యార్థినులు బిక్కు బిక్కుమంటూ విద్యాభ్యాసం సాగించాల్సి వస్తోంది.

పెండింగ్‌లోనే ప్రహరీ పనులు

టిడిపి హయాం నుంచి నేటి వరకు రెండు దఫాలుగా ప్రహరీ నిర్మాణ పనులకు అనుమతులు లభించినప్పటికీ పనులు చేపట్టలేదు. వైసిపి హయాంలో రూ.24 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులకు ఆమోదం లభించింది. నెలల తరబడి ప్రహరీ పనులు చేపట్టడం లేదు. పందులు, పశువులు, తాగుబోతుల సంచారం నేపథ్యంలో ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టడంలో జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. టిడిపి హయాంలో కాంట్రాక్టర్ల మధ్య విభేదాలు, వైసిపి హయాంలో ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టకపోవడానికి కారణాలేమిటో తెలియడం లేదు.

మొద్దునిద్రలో ఎస్ఎస్ఎ

టిడిపి హయాం నుంచి నేటి వరకు రెండు దఫాలుగా నిధులు మంజూరైనప్పటికీ ప్రహరీ నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. ఇటీవల ప్రహరీ నిర్మాణ పనులకు ఆమోదం లభించినప్పటికీ నిర్మాణ పనులకు వచ్చిన అడ్డంకులేమిటో అధ్యయనం చేసి పరిష్కరించాల్సిన జిల్లా స్థాయి అధికారులు మొద్దునిద్ర పోతున్నారు. ఎస్ఎస్ఎ పిఒగా జిల్లా స్థాయి అధికారి హోదాలో ఉంటూ సొంతఇలాఖాలోని కెజిబివి పాఠశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడంలో అంతులేని నిర్లక్ష్యం తగదనే ప్రశ్న వినిపిస్తోంది.

పిల్లలను సన్మార్గంలో పెట్టే బాధ్యత తల్లిదండ్రులదే : జడ్జి

ప్రజాశక్తి - కడప

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

పిల్లలను సరైన మార్గంలో నడిపించే బాధ్యత తల్లిదండ్రులదే అని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. బాలల చట్టాల అవగాహన కార్యక్రమాలలో భాగంగా ఆదివారం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో పెన్నార్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్నటువంటి చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఎఎస్ఐలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ సోషల్ మీడియా వంటివి పిల్లలపై ప్రభావాన్ని ఎక్కువగా చూపుతున్నాయని, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, పిల్లలకి మంచి చెడులను చెప్పినప్పుడే వారు సరైన మార్గంలో నడుస్తారని అన్నారు. 18 సంవత్సరాలు లోపు ఉన్నటువంటి పిల్లలు ద్విచక్ర వాహనాన్ని నడిపినట్లు అయితే పోలీసులు అటువంటి వారిపై కేసు నమోదు చేయడంతో పాటు ద్విచక్ర వాహన యజమాని పై కేసు నమోదు చేయడం ద్వారా వారిలో మార్పు తీసుకు రావచ్చు అని తెలియజేశారు.విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి డి. శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాలలకు రక్షణ కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నామని అన్నారు. పిల్లలకు సంబంధించినటువంటి విషయాలు పోలీస్ స్టేషన్ వరకు వచ్చినప్పుడు ఎలాంటి పద్ధతులు పాటించాలి, పిల్లల కోసం ఉన్నటువంటి చట్టాలు, వ్యవస్థల గురించి అవగాహన కల్పించడం కోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఉన్నటువంటి చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ బాల్య వివాహ నిరోధక అధికారిగా ఉంటారని తెలియజేశారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.ఆర్. సుబాష్ యాదవ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాలల కొరకు పనిచేస్తున్నటువంటి వ్యవస్థలను, బాలల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో కడప జిల్లా దిశ సిఐ, ఎస్ఐతోపాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సన్మాన గ్రహీతలతో డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థానాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని ఉప ముఖ్యమంత్రి ఎస్ .బి. అంజద్ బాషా తెలిపారు. సీనియర్ పాత్రికేయులు చౌడం సూరిబాబు ఆధ్వర్యంలో గ్రూప్ వన్‌లో మంచి ర్యాంకులు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వంకం సాయి హర్షిత, కమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికైన మేరువ చందు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్‌ను సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రతి ఉద్యోగీ తమ బాధ్యతగా ప్రజల కష్టాలు, సమస్యలు తీర్చడంలో శక్తివంతన లేకుండా కృషి చేసితమ ఉద్యోగానికి న్యాయం చేయాలన్నారు. పిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకున్నారంటే తల్లిదండ్రుల పాత్ర అమోఘమైనదన్నారు. పిల్లలను ఉన్నత శిఖరాలకు చేర్చడంలో నిరంతరం కష్టపడతారని, వారి పిల్లలు ప్రయోజకులుగా తయారైన తర్వాత ఎంతో సంతోషిస్తారని చెప్పారు. వంకం సాయి హర్షిత ,మేరువ చందు రాణించి జిల్లా , దేశ కీర్తి ప్రతిష్టతలను ఇనుమడింప చేశారన్నారు. సీనియర్ పాత్రికేయులు చౌడం సూరిబాబు మాట్లాడుతూ సమాజంలో గౌరవ ప్రతిష్టలు, గుర్తింపు, చదువు ద్వారానే సాధ్య మవుతాయని ,ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఉన్నత విద్యావంతులను చేర్చడంలో రాజీ పడవద్దని చెప్పారు. సత్కార గ్రహీతలు వంకం సాయి హర్షిత ,మేరువ చందు మాట్లాడుతూ తాము ఈ స్థాయికి చేరుకున్నామంటే తల్లిదండ్రులు, గురువులు ,మిత్రుల సహకారం వల్లే సాధ్యమైందన్నారు.

కృపా కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కడప : కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని పాస్టర్ పి.మహేష్ స్థానిక ప్రజలు కోరారు. స్థానికుడు మేడెం ప్రదీప్ సహకారంతో ఆదివారం పాస్టర్ మహేష్ పర్యవేక్షణలో తాత్కాలిక మట్టి రోడ్డు ను ఏర్పాటు చేశారు. గతంలో ఈ ప్రాంతం ప్రమాదకరమైన నీటి గుంటలు, మహిళలు విద్యార్థులు నడవడానికి చాలా ఇబ్బందికరంగా ఉండేదని, పాములు తేళ్లు సంచరించేవని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ నాయకులు అవగాహన చేయగా స్థలం యజమానులు వారి ప్లాట్లలో నీటి గుంతలను పూడ్చారు. కంప చెట్లను తొలగించారు. నగరపాలక సంస్థ అధికారులు ఈ కాలనీ మరింత అభివృద్ధి చేసేందుకు కృపా కాలనీని సందర్శించాలని స్థానిక ప్రజల కోరుతున్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

సైన్స్ పరంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుతం కాలంలో మూఢ నమ్మకాలను వీడాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయ సమావేశపు హాలులో జెవివి 17వ జిల్లా మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీతోపాటు వైవీయూ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, జెవివి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ కల్పన హాజరయ్యారు. ఈ ముందుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్, శాస్త్రీయ దృక్పథంపై వివరించారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ ఆలోచనలు పెరగాలని తెలిపారు. చంద్రయాన్-3ను విజయ వంతంగా ప్రయోగించినా దాని చుట్టూ మూఢనమ్మకాలను అల్లడం దురదృష్టకరమని చెప్పారు. నేటి కాలంలో జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థల ప్రాధాన్యత, అవసరం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. సైన్స్ ఫలితాలు సామాన్యులకు చేరవేయడంలో జనవిజ్ఞాన వేదిక ముందు ఉందని చెప్పారు. ఆహార పదార్థాలలో వాడే రంగులు ఆరోగ్యానికి హానికరమన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర నాయకులు తవ్వా సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడి దేవదత్తం, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు, సుజన్‌కుమార్ , హన్నా ఎస్తేర్, వివిధ మండల జిల్లా నాయకులు సునీత, కామేశ్వరమ్మ, పి.కిరణ్, యూత్ నాయకులు కిరణ్, శివరాం, నంగా రాజేష్, డా.చక్రదర్, ప్రొద్దుటూరు సునీత, మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సుప్రదీప్ పాల్గొన్నారు.

బొజ్జ శ్రీనివాసులను పరామర్శించిన తులసిరెడ్డి

కడప : నగరంలోని ప్రైమ్ హాస్పిటల్‌లో కుడి భుజం ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న చింతకొమ్మదిన్నె మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొజ్జ శ్రీనివాసులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి పరామర్శించారు. అధైర్య పడకుండా వైద్యులు సూచించిన నియమాలు పాటించాలని, మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకొని కుటుంబానికి, ప్రజా క్షేత్రానికి అండగా ఉండాలని ఆకాంక్షించారు.

పేదలకు అన్నదానం

కడప : కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి జన్మదిన సందర్భంగా అవినాష్ రెడ్డి యూత్ రహీం ఆధ్వర్యంలో జడ్‌పి సర్కిల్‌లో ఆదివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ ఆధ్వర్యంలో అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్ర మంలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్రరెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్ పులి సునీల్ కుమార్, హఫీజ్, కడప నగరం మహిళా అధ్యక్షురాలు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

తెలుగుభాష ఊపిరి లాంటిది

ప్రజాశక్తి- కడప అర్బన్

మన తెలుగు భాష మనకు ఊపిరి లాంటిదని ఆంగ్లాన్ని లేదా ఇతర భాషను ఉపాధి కోసం నేర్చుకోవడంలో తప్పులేదని రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. రాష్ట్ర అధికార భాషా సంఘం ఆధ్వ ర్యంలో వ్యవహార భాషోద్యమకర్త గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా జిల్లాలో జరుగుతున్న తెలుగు భాషా వికాస ఉత్సవాలలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో కడప నగరం పాత కలెక్టరేట్‌లో ఇంటాక్ సంస్థ కార్యాలయంలో ఆదివారం తెలుగు భాష వికాస దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రి పైన ఉందని, ప్రతి పౌరుడు బాధ్యతగా మన భాషను భావితరాలకు అందించవలసిన అవసరాన్ని గుర్తు ఎరగాలని సూచించారు. పాఠశాలలో బై లింగ్వల్ పుస్తకాలను ఉపయోగించడంతో ఉపాధ్యా యులకు, ఇటు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉందని పేర్కొ న్నారు. జిల్లాలో తెలుగు భాష అమలు పోలీసు శాఖలో చాలా బాగా ఉందని పాఠశాలల్లోనే మన భాష పట్ల గౌరవం సన్నగి ల్లినట్టు కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లీషుతోనే అన్ని లభిస్తాయని భావించడం అవివేకమని, ఉపాధి కోసం ఏ భాష నేర్చుకున్న ఎవరికీ అభ్యంతరం లేదని కానీ మాతృభాషను మరవడం మంచిది కాదన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ తమిళ భాషాభిమానాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కోట మృత్యుం జయరావు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, కళాభిమానులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

కార్పొరేట్ తరహా వైద్యసేవలకు

కసరత్తు

- స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలు పూర్తి
- లూనార్ ఆపరేషన్ థియేటర్ల సదుపాయాలు
- టిఫా స్కాన్ సహా ఆధునిక డయాగ్నోస్టిక్ సేవలు
- 'తల్లీబిడ్డ'తో గర్భిణులకు ఉచిత ప్రయాణ సేవలు
- డిసిహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ హిమపద్మజ వెల్లడి

ప్రజాశక్తి - కడపప్రతినిధి

జిల్లాలోని కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందిస్తాం. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం రీస్ట్రక్షరింగ్ పాలసీ ద్వారా కార్డియా లజీ మొదలుకుని గైనకాలజీ వరకు స్పెషలిస్టు వైద్యులు, స్టాఫ్‌నర్స్‌ల నియామకాలను చేసింది. ఎంఆర్ఐ, సిటి, టిఫా స్కాన్, అల్ట్రాసౌండ్ సహా అత్యాధునిక లూనార్ ఆపరేషన్ థియేటర్ల సదుపాయాలను అందుబాటులోకి తెచ్చింది. వీటి సహాయంతో గైనిక్, యండి, సర్జరీ, పీడియాట్రిక్, కార్డియాలజీ, హౌస్‌సర్జన్ తదితర నిష్ణాతులైన వైద్యులతో సేవలను మెరుగుపరచనున్నాం. దీనికితోడు ప్రతినెలా గర్భిణుల చెకప్ నిమిత్తం తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ సహాయంతో ఉచిత ప్రయాణ సేవలను అందుబాటులోకి తెచ్చా మని పేర్కొంటున్న సందర్భంగా డిసిహెచ్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ హిమదేవితో ప్రజాశక్తి ముఖాముఖి...

ముఖా ముఖి..

జిల్లాలోని సిహెచ్‌సి ఆస్పత్రులు ఎన్ని?

ఉమ్మడి జిల్లా పరిధిలో 10 సిహెచ్‌సి ఆస్పత్రులున్నాయి. వీటి తోపాటు ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, పులివెందుల ఏరియా ఆస్పత్రి ఉన్నా యి. ఇందులో సుమారు 24 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంచడ మైంది.

వైద్యుల కొరతపై మాట్లాడండి?

రాష్ట్రప్రభుత్వం రీస్రక్షరింగ్ పాలసీ ద్వారా సాధారణ వైద్యులు దగ్గర నుంచి స్పెషలిస్టు వైద్యులను పెద్దఎత్తున రిక్రూట్‌మెంట్ చేసింది. ఇందులో భాగంగా 120 మంది వైద్యులు, 40 మంది స్టాఫ్‌నర్స్‌లు అద నంగా రావడమైంది. ఫలితంగా జిల్లాలోని ప్రతి సిహెచ్‌సిల్లో సాధారణ వైద్యుల దగ్గర నుంచి కళ్లు, ఎముకలు, కీళ్లు, చెవి, గుండె, గైనిక్, ఆన స్థీషియా సంబంధిత వైద్యనిపుణులతోపాటు స్టాఫ్‌నర్స్ పోస్టుల వరకు కొరత లేకుండా పోయింది.

ఓపి సేవల వివరాలు తెలపండి?

జిల్లాలోని 10 సిహెచ్‌సి ఆస్పత్రుల్లో నెల వారీగా 1,45,500 మంది ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలు అందుతున్నాయి. ఏప్రిల్ నుంచి 85 శాతం నుంచి 92 శాతానికి ఓపి సేవల్లో పెరుగుదల కనిపిస్తోంది. వీటి తోపాటు సుమారు 24 రకాల ల్యాబ్, ఎక్స్‌రే తదితర సేవలు అందుబా టులో ఉంచడమైంది.

ఐపి సేవల గురించి చెప్పండి?

డిసిహెచ్ఎస్ పరిధిలో ప్రతినెలా 13.200 మంది ఇన్‌పేషెంట్ రోగులు ఉన్నారు. గతంలో 83 శాతం నుంచి 123 శాతానికి ఆపరేషన్స్ పెరగడం గమనార్హం. ఇందులో ఆపరేషన్స్, ఎఫిఎస్ డెలివరీస్, లాబ్‌టెస్ట్ ల సంఖ్య అమాంతంగా పెరిగింది.

అత్యాధునిక వైద్యసేవలను వివరించండి?

హైరిస్క్ గర్భిణులు, అనీమియా రోగులకు సెకెండరీ హెల్త్‌కేర్ హాస్పిటల్స్‌లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తేవడమైంది. అనీ మియా రోగులకు ఐరన్, సుక్రోస్ ఇంజెక్షన్స్, బ్లడ్‌ట్రాన్స్‌ఫర్మేషన్ సదుపాయాలు ఉన్నాయి. సిజేరియన్ ఆపరేషన్స్, డెలి వరీస్ నిర్వహణకు అవసర మైన అత్యా ధునిక పరికరాలు, లూనార్ ఆపరేషన్ థియేటర్ వంటి అత్యా ధునిక సదు పాయాలు ఉన్నాయి. వీటిసహాయంతో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాం.

గర్భిణులకు గల సదుపాయాలు ఏమిటి?

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రతినెలా గర్భిణులు హెల్త్ చెకప్‌నకు ఉచిత ప్రయాణ సేవలను అందు బాటులోకి తేవడమైంది. డెలివరీస్‌తో పాటు డేకేర్ ట్రీట్‌మెంట్ సదుపాయాన్ని అందుబాటులోకి ఉంచడ మైంది. గర్భస్థ శిశు ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడానికి టిఫా స్కాన్ నిర్వహణకు ఆరోగ్యశ్రీ సదుపాయం కలిగిన ప్రయివేటు స్కానింగ్ సెంటర్‌లో ఉచిత సేవలు పొందేందుకు చర్యలు తీసుకోవడమైంది.

టెలీ మెడిసిన్ సేవలు గురించి తెలపండి?

ప్రొద్దుటూరు సిహెచ్‌సి పరిధిలో టెలిమెడిసిన్ సేవలు అంది స్తున్నాం. ఇందులో గైనకాలజీ, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, విభాగాల్లో టెలిమెడిసిన్ సదుపాయాలు ఉన్నాయి. రోజూ 500 నుంచి 700 మందికి టెలీసేవలను అందిస్తున్నాం.

డయాలసిస్ కేంద్రాల గురించి చెప్పండి?

జిల్లాలో ప్రొద్దుటూరు, పులివెందుల సిహెచ్‌సిల్లో డయాలసిస్ కేం ద్రాలు ఉన్నాయి. తాజాగా బద్వేల్ సిహెచ్‌సిలో డయాలసిస్ కేంద్రం ఏర్పా టుకు ప్రతిపాదనలు పంపించాం.

ఆరోగ్యశ్రీ సేవలు ఎలా ఉన్నాయి?

జిల్లాలోని అన్ని సిహెచ్‌సిల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపిన 3,255 రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ సేవలు అందించడం జరుగుతోంది.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి-కాశినాయన

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర అన్నారు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర ఆదివారం మండల కేంద్రమైన నరసాపురానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎపిమోడల్ పాఠశాలలోని హాస్టల్ విద్యార్థులతో వారు మాట్లాడుతూ ఇక్కడ అధ్యాపకుల కొరత ఉందని వెంటనే పోస్టులు భర్తీ చేసి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం నాంది పల కాలని కోరారు ప్రభుత్వ విద్యారంగాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ విద్యారంగాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ విధానం మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. 40 సంవత్సరాల నుంచి నర్సాపురంలో ఎస్సీ బాలుర వసతిగృహం అద్దె భవనంలో నడుస్తుందని, అక్కడ వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కొన్ని కోట్ల ఇన్‌ఛార్జి వార్డెన్లతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, వైసిపి ప్రభుత్వం వచ్చినాక విద్యారంగం పూర్తిగా వెనకబడి పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సునీల్ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మండల నాయకులు సందీప్ సుమంత్ రాజశేఖర్‌శేఖర్ పాల్గొన్నారు

బి.కోడూరు : మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సగిలి రాజేంద్రప్రసాద్, గండి సునీల్ పేర్కొన్నారు. విద్యార్థుల సంగ్రామ స్కూటర్ యాత్ర భాగంగా మండల కేంద్రానికి చేరుకుంది. గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సగిలేరు గురుకుల పాఠశాలలో 350 మంది విద్యార్థులు ఉండగా వారికి సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు భోజనం సరిగా పెట్టడం లేదని విద్యార్థులు వాపోయారని అన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు తెలిపారని వారు అన్నారు. గదులు, ఫ్యాన్లు, లైట్లు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కారం చేయకపోతే మండల వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి , మండల నాయకులు సందీప్ , రాజశేఖర్, సందీప్, మల్లి పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బ్రహ్మంగారిమఠం : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర' ఆదివారం మధ్యాహ్నం బ్రహ్మంగారిమఠం చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, మండల కమిటీ ఘనస్వాగతం పలికింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్‌కుమార్, సగిలి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ విద్యారంగాన్ని పెంచి పోషిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ప్రమాదకరమని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ శరవేగంగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో రెగ్యులర్ వార్డెన్‌లను నియమించకుండా ఇన్‌ఛార్జిలతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. సిద్దవటంలో ఎస్‌సి, బిసి బాలికల హాస్టల్, బద్వేల్‌లోని ఎస్‌సి బాలికల హాస్టల్‌కు కలిపి ఒకరినే వార్డెన్‌గా నియమించి విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. జిల్లాలో చదువుకున్న యువతకు ఉపాధి చూపడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని వారు తెలిపారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వానికి పతనం తప్పదని వారు హెచ్చరించారు. యాత్రలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాహుల్, సహాయ కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా కమిటీ సభ్యుడు యర్రంపల్లి అజయ్, నాయకులు మోహన్, రాజశేఖర్, రమేష్, సందీప్, అరవింద్, దేవ, రాహుల్, సన్నీ, నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప

కువైట్‌లో ప్రమాదంలో బద్వేల్ అట్లూరు మండలం బొడిచేట్టి పల్లికి చెందిన పొన్నవోలు నరసారెడ్డి మరణించారు. ఆయన కుటుంబానికి వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా చేతుల మీదుగా రూ. 1.22 లక్షల ఆర్థిక సాయాన్ని కువైట్ రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు చేశారు. కార్యక్రమంలో వైసిపి గల్ఫ్, కువైట్ కన్వీనర్లు ఇలియాస్ బి.హెచ్, ముమ్మడి బాలిరెడ్డి, కో - కన్వీనర్ యం.వి. నరసారెడ్డి, రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కువైట్ ఉపాధ్యక్షులు మధు సూదన్‌రెడ్డి, ఆరవ సుబ్బారెడ్డి, సలహాదారులు గజ్జల నరసారెడ్డి, మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు పి . సురేష్‌రెడ్డి, హనుమంతురెడ్డి, జి. ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న డిప్యూటీ సిఎం

వేంపల్లె షరీఫ్‌కు 'గిడుగు' పురస్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె షరీఫ్

కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు రాష్ట్ర అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ తరపున గిడుగు వేంకట రామ్మూర్తి పంతులు భాషా పుర స్కారం ప్రకటించారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెకు చెందిన షరీఫ్ 20 ఏళ్లుగా సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఉన్నారు. ఆయన కథలు అనేక భారతీయ భాషల్లోకి అనువాదమ య్యాయి. అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రత్యేక సంకలనాల్లో ఆయన కథలు ప్రచురితమయ్యాయి. జుమ్మా, టోపీ జబ్బార్, తియ్యని చదువు, యువ వంటివి షరీఫ్‌కు పేరు తెచ్చి పెట్టిన రచనలు. ప్రస్తు తం అధికార భాషా సంఘం తరపున గిడుగు పురస్కారం ప్రకటించడం ఆనం దంగా ఉందని రచయిత వేంపల్లె షరీఫ్ తెలిపారు. ఈనెల 29న విజయ వాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో షరీఫ్‌కు పురస్కార ప్రదానం చేయనున్నారు. ఆ మేరకు ఆయన్ని పురస్కార గ్రహీతగా ఆహ్వానిస్తూ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయ్‌బాబు లేఖ పంపారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

నేడు బద్వేలులో భూమి కోసం సదస్సు

ప్రజాశక్తి - చాపాడు

బద్వేల్ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో భూమి కోసం నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం మైదుకూరు మండల నాయకులు రాయప్ప, భీముడు కోరారు. ఆ మేరకు వారు ఆదివారం జివి సత్రం గ్రామంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, పేదలకు ఇంటి స్థలాలు, భూములు మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారులకు అసైన్డ్ మెంట్ ద్వారా పట్టాలు పంపిణీ చేయాలన్నారు. అన్నిరకాల ప్రభుత్వ సౌకర్యాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ నేడు ధర్నా

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇళ్ల కాలనీల్లో కనీస వసతుల కల్పనలో అధికారుల అలసత్వాన్ని నిరసిస్తూ సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చనున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు గృహ నిర్మాణానికి 2008, 2018లో ఇంటి స్థలాలిచ్చి వాటికి కనీస వసతులు కల్పిచడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. దాదాపు రెండువేల మంది సొంత డబ్బు ఖర్చు చేసి బేస్ మట్టాలు వేసుకున్నారని, అవి శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వీడి కనీస వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. ధర్నాలో బాధితులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజలపై విద్యుత్ ఛార్జీల బాదుడు

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యుత్ ఛార్జీల పెంపుతో రాష్ట్ర ప్రజలపై మోయలేని భారాన్ని వేసి బాదుడు రెడ్డిగా జగన్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరెంట్ తీగ పట్టుకుంటే షాక్ కొట్టడం సహజమని, వైపిపి పాలనలో కరెంట్ బిల్లు ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి దాపురించిందన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచకుండా తగ్గిస్తామని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని మండిపడ్డారు. నాలుగున్నర సంవత్సరాల వైసిపి పాలనలో 8 సార్లు కరెంటు ఛార్జీలు పెంచారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ళకు, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు ఆర్థికభారం మోపుతున్నట్లు చెప్పారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.11,270 కోట్లు ఆర్థికభారం వేస్తున్నట్లు తెలిపారు. ఏరు దాటినంత వరకు ఓడ మల్లన్న దాటాక బోడి మల్లన్న అన్నట్లుంది జగన్ వాలకమని విమర్శించారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు వైసిపికి రివర్స్ షాక్ ఇవ్వడం జరుగుతుందని తులసిరెడ్డి హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రహ్మణ్యం, ధృవకుమార్‌రెడ్డి, రామకృష్ణ, నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రీ, రాఘవయ్య, శివ, వినయ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఆదివారం మిస్పా మూవీ పద్మాకర్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించారు. కార్యక్ర మాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్‌రెడ్డి పర్య వేక్షించారు.

యాదవ అన్నసత్రం నూతన అధ్యక్షులుగా పెరుగు కృష్ణయ్య యాదవ్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


పెరుగు కృష్ణయ్య యాదవ్

బ్రహ్మంగారిమఠం యాదవ అన్నసత్రం నూతన అధ్యక్షులుగా పెరుగు కృష్ణయ్య యాదవ్ ఎన్నికయ్యారు. యాదవ అన్నసత్రం ప్రాంగణంలోని పుట్టా వారి కళ్యాణ మండపంలో ఆదివారం పాలక మండలి సమవేశం నిర్వహించారు. ఎపి రామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఎన్నిక కమిటీ పెరుగు కృష్ణయ్య యాదవ్‌ను నూతన కమిటీ అధ్యక్షులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాలక మండలి నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనని ఎంపిక చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వర్షం కోసం రైతుల ఎదురుచూపు

సగటు వర్షపాతం కూడా నమోదుకాని పరిస్థితి-రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

ఆగస్టు నెల పూర్తి కావస్తున్న పదును వర్షం పడలలేదు. ఇప్పటికే ఖరీఫ్ సాగులో రైతులు ఎంతో బిజీగా ఉండాల్సింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలో వరి పంట సాగు చేయాలనుకునే రైతులు ముందస్తుగా పచ్చి రొట్ట ఎరువుగా జీలగ, జనుము సాగు చేశారు. అయితే భూమి సరిగా పదును కాక పోవడంతో జీలగ సాగు ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు. రైతులు సాగు చేపట్టిన పసుపు పంట వర్షాలు సరిగా లేకపోవడంతో ఆశాజ నకంగా లేదు. బోర్ బావులు, కుందు తీర ప్రాంతాల్లోని రైతులు కొంతమంది పసుపు, వరి సాగు చేపట్టారు. కేసీ కెనాల్ కాలువ కింద పసుపు సాగు చేప ట్టిన రైతులు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు సుమారైన వర్షం కూడా పడకపోవడంతో భూమి పదును ఎక్కలేదు. మండల పరిధిలో ఈ ఏడాది ప్రారంభం నుంచి పడిన వర్షపాతాన్ని గమనిస్తే జనవరి నెలలో సాధారణంగా 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి.. అయితే నీటి బొట్టు పడలేదు. ఫిబ్రవరి నెల పరిస్థితి కూడా అంతే. మార్చిలో మాత్రం నాలుగు మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 90.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత ఏప్రిల్ నెలలో 16 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా చినుకు రాలేదు. మే నెలలో 2.6 మిల్లీమీటర్లు, జూన్‌లో 37.6 మిల్లీమీటర్లు, ప్రస్తుతం జులై నెలల ఏడు మిల్లీమీటర్లు నమోదైంది. సగటున ఈ ఎనిమిది నెలల కాలంలో 2వందల మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కా వాల్సి ఉండగా కేవలం 100 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. మండల పరిధిలో కేసీ కెనాల్, కుందూ నదుల కింద సుమారుగా 23 వేల ఎకరాల్లో వరి, పసుపు ఇతర పంటల సాగు అవుతాయి. అయితే కేసీ కెనా ల్‌కు నీరు విడుదల కావాలంటే ఎగువ ప్రాంతాల్లో వర్షం అధికంగా పడాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆల్మట్టి, తుంగభద్ర, శ్రీశైలం జలాశయాల్లో నీటి

సిద్ధారెడ్డిపల్లె వద్ద బీడుగా దర్శనమిస్తున్న పొలాలు

మట్టాలు నామమాత్రంగా ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఇంకా కొద్ది మేరకు పెరిగినట్లయితే అక్కడినుండి మన జలాశయాల్లోకి నీరు వచ్చే అవకాశాలు ఉంటాయి. రాయలసీమలో మాత్రం అనుకున్న మేరకు వర్షాలు లేకపోవడంతో రైతులు పంటల సాగు సకాలంలో చేపట్టే పరిస్థితి కనబడడం లేదు. జలాశయాల్లోకి తగిన నీరు వస్తే తప్ప పంటల సాగు అయ్యే సూచనలు కనపడడం లేదు. మెట్ట ప్రాంతాల్లో మాత్రం రైతులు పంట సాగు కోసం ఆశలు వదులుకున్నారు. ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో మీరు వస్తే తప్ప కాలువల కింద పంటల సాగు జరిగే అవకాశం ఉండదు గత ఏడాది వర్షాలు సకాలంలో పడడంతో కేసీ కాలువకు ఆగస్టు 11న నీరు విడుదలైంది. దీంతో వరిసాగు 15వేల ఎకరాల్లో సాగైంది. ఈ ప్రభావం దిగుబడిపై చాలావరకు కనపడింది. ఈ ఏడాది కూడా వర్షాలు సకాలంలో పడకపోతే పూర్తిస్థాయిలో సాగు అనుమానమే.

టిడిపిలో చేరిన బిజెపి నేత

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిన డివి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి పులివెందుల అసెంబ్లీ మాజీ ఇన్‌ఛార్జి డాక్టర్ డివి సుబ్బారెడ్డి టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర పార్టీ కార్యాలయంలో చంద్రబాబును టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ డివి సుబ్బారెడ్డి శనివారం రాత్రి కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అద్వానీ, వాజ్‌పేయి అక్షరణకు గుర్తై డివి సుబ్బారెడ్డి బిజెపిలో చేరారు. పులివెందుల అసెంబ్లీ స్థానానికి కూడా పోటీ చేశారు. 1990 నుండి బిజెపిలో కీలకంగా ఉంటూ పులివెందుల నియోజకవర్గంలో ఆయా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. బిజెపిలోని కొందరు నాయకులు డాక్టర్ సుబ్బారెడ్డికి సముచిత స్థానం కల్పించకపోవడంతో ఆ పార్టీ నుండి వైతొలిగి మౌనంగా ఉంటూ వచ్చారు. రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వేంపల్లె మండలంలో టిడిపి బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, బాలకృష్ణారెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, గోగుల మారుతి, టివి శ్రీనివాసులు, జబిబుల్లా, వేమా నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్‌రెడ్డి 39వ జన్మదిన వేడుకలు పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప ఆధ్వ ర్యంలో మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హిందూ పూజారి నాగేశ్వర శర్మ, ముస్లిం మౌలానా అబ్దుల్ రెహమాన్, క్రైస్తవ ఫాదర్ ప్రకాష్ సర్వమత ప్రార్థనలతో ఘనంగా నిర్వహించారు. మత పెద్దలు వైయస్ అవినాష్‌రెడ్డికి జన్మదిన ఆశీర్వాదాలు అందజేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, వాల్మీకి సంఘ డైరెక్టర్ నారాయణస్వామి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పులివెందుల బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీ జన్మదినం సందర్భంగా సంఘంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను పురపాలక ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వరప్రసాద్ కట్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్, కో-ఆప్షన్ నెంబర్ దాసరి చంద్రమౌళి, సూరి, చంద్రమౌళి, నాగరాజు, స్నే హిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, టెంకాయల రాము, పద్మనాభరెడ్డి, దూల కల్ సంఘ అధ్యక్షుడు ఫక్రుద్దీన్, బలిజ సంఘం నాయకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ

4వ వార్డ్ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యంలో 80 మంది అనాథ వృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు దుస్తులు పంపిణీ చేశారు. కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినోత్సవ సందర్భంగా స్థానిక భాకరాపురంలో ఉన్న ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో పార్నపల్లి కిషోర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మెన్ చిన్నప్ప, వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, సిద్దయ్య, ఖాదర్‌బాషా, రంగనాయకులు, గుల్జార్, హముదు, రాజశేఖర్‌రెడ్డి, కో-ఆప్షన్ చంద్రమౌళి, కాంతమ్మ, పార్టీ నాయకులు వెంకట సుబ్బయ్య, కోడి రమణ, వీరారెడ్డి, పద్మనాభరెడ్డి, చంద్రమౌళి, రసూల్, సంపత్, కృష్ణమూర్తి, మునీంద్రా, గంగరాజు, వెంగముని, హరి, నూర్‌బాషా పకద్దిన్, పార్నపల్లి కిరణ్ కుమార్, నాగరాజు, బాలయ్య, మెకానిక్ శేఖర్ నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో పాలు, బ్రెడ్లు పంపిణీ

ముద్దనూరు : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న యేసు కరుణాలయం అనాథ ఆశ్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ముందుగా అవినాష్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రాజుల శివశంకర్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, మౌనిక మిల్క్ డైరీ ఎండి శ్రీనివాసులు, నాయకులు నాగమనాయుడు, వెంక టరెడ్డి, రామాంజనేయరెడ్డి, రామంజులరెడ్డి, రాజశేఖరరెడ్డి, సూర్యమునిరెడ్డి,

పులివెందులలో సర్వమత ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

కిరణ్ కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, మునెయ్య, జాకోబ్, ఆశ్రమ నిర్వాహకులు పాస్టర్ ఇమ్మానియేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. భద్రపల్లి రోడ్డు వద్ద వైసిపి ఎస్సీ సెల్ కన్వీనర్ బండి పుల్లయ్య ఆధ్వర్యంలో పార్టీ జిల్లా మైనారిటీ కార్యదర్శి బోలోరో బాషా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బద్రిపల్లె సచివాలయ కన్వీనర్ ఓబుళరెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కాశినాయన వృద్ధాశ్రమంలో..

పల్లవోలు వద్ద గల కాశినాయన వృద్ధాశ్రమంలో వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గూడూరు దస్తగిరి ఆధ్వర్యంలో ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే తనయులు మైదుకూరు నియోజకవర్గ సమన్వ యకర్త ఎస్.నాగిరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చియ్యపాడు-2 మాజీ ఎంపీటీసీ దాసరి మహేష్ బాబు, వైసిపి నాయకులు నరసింహారెడ్డి, శ్రీను బ్రహ్మేంద్ర, లక్ష్మీనారాయణ, రాంప్రతాప్ , కిశోర్, పవన్ పాల్గొన్నారు.

వేంపల్లె : కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి పుట్టినోజు వేడుకలను ఆదివారం వేంపల్లె మండలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కార్యకర్త రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ ఏర్పాటు చేశారు. వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఇడుపులపాయ పంచాయతీలోని వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద రాయలసీమ కాపునాడు యవజన సంఘం అధ్యక్షుడు కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనాథ వృద్ధాశ్రమంలోని మాజీ సర్పంచు రామాంజనేయురెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ గోగుల కొండయ్య, రవిశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసిలు పద్మా రాజ్‌కుమార్, కటిక చంద్రశేఖర్, భారతి, బ్రహ్మయ్య, మార్కెట్ కమిటీ డ్కెరెక్టర్ రామకృష్ణారెడ్డి, షెక్షావలి, నిసార్ బాషా, ప్రసాద్‌రెడ్డి, పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై బిజెపి విద్వేషం

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న అలీఖాన్

భారత పార్లమెంటరీ వ్యవ స్థకు అత్యంత ప్రాణాధారమైన, గౌర వప్రదమైన భారత రాజా ్యంగంపై భారతీయ జన తా పార్ిీ విద్వేషం వెళ్లగక్కుతోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం పై ఇటీవల రాజ్యసభలో ఓ బిల్లుకు సంబ ంధించిన చర్చ సందర్భంగా బిజెపి ఎంపీ, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గోగోయ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణం సక్రమంగా లేదని, దీనిపై సందేహాలు ఉన్నాయని, అందువల్ల భారత రాజ్యాంగం పై చర్చించాల్సిన అవసరం ఉందని విద్వేషపూరిత ప్రసంగం చేశా రన్నారు. 2014వరకు సమర్థవంతంగా భారత రాజ్యాంగం అమలు చేయగా, తొమ్మిదేళ్ల కాలంలో బిజెపి నాయకులు, ఆ పార్టీ ప్రభుత్వం భారత రాజ్యాం గాన్ని ధ్వంసం చేస్తున్నారని విమ ర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ , దాని మూక సంస్థ ఆర్ఎస్ఎస్‌కు ప్రజలు సమాధి కడతారని హెచ్చరించారు. సమావేశంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఎం. రహమతుల్లా ఖాన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం

ప్రజాశక్తి - కలకడ

మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు సూపర్వైజర్ మల్లికార్జున తెలిపారు. అధికారుల చొరవతో మదనపల్లికి చెందిన కాంట్రాక్టర్ బివి రమణ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటుతో వీధిదీపాలు, ఇల్లకు విద్యుత్తు, బోరు మోటారు, ఏర్పాటు చేయడానికి వీలుంటుందని కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌ను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ పునర్నిర్మాణానికి రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప రూ.50 వేలు ఆదివారం దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్పను, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డిని పూలహారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ పుననిర్మాణానికి చైర్మన్ చిన్నప్పను అడగగానే రూ.50 వేలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. చైర్మన్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పనులు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కొండారెడ్డి, నాగరాజు, రఘునాథరెడ్డి, హజార్, సిద్దయ్య పాల్గొన్నారు.

గడ్డివాముల్లో సోదా చేస్తున్న పోలీసులు

ఘర్షణలకు పాల్పడవద్దు : ఎస్ఐ

ప్రజాశక్తి - చాపాడు

ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని, ఘర్షణలకు పాల్పడవద్దని ఎస్ఐ మైనద్దీన్ సూచించారు. మండల పరిధిలోని చిన్నవరదాయపల్లి గ్రామంలో ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని అను మానితుల ఇళ్లు, ఖాళీ ప్రదేశాలు, గడ్డివాములలో సోదాలు నిర్వహించామని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

రైతులను ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలోని చెరువులను వెంటనే నింపి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి కోరారు. స్థానిక వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ కింద కొంతమంది రైతులు పంటలను సాగు చేశారన్నారు. వర్షం రాక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లలో నీరు పుష్కలంగా ఉన్నందున వాటి ద్వారా చెరువులకు నీరు నింపితే రైతులు వారి పంటలను కాపాడుకుంటారన్నారు. అలాగే పంటలు వేయకుండా బీడు పెట్టుకున్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణ, ప్రభుత్వ అవసరాల కోసం నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకుంటారో చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీకి ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుగుట్ల రాఘవరెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిని బలోపేతం చేయండి

చక్రాయపేట : పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో టిడిపిని బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, ఇన్‌ఛార్జి బీటెక్ రవి కోరారు. మండలంలోని సురభి గ్రామం నాగలగట్టుపల్లెలో ఆదివారం మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రతి కార్యకర్త తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, మీకు తాను అండగా ఉంటానని వారికి భరోసా ఇచ్చారు. ఏదేమైనప్పటికీ చక్రాపేట మండలంలో సురభి గ్రామం అర్థమండలమని సురభి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తే చక్రాపేట మండలంలోనే కాదు పులివెందుల నియోజ కవర్గంలో కూడా పార్టీ పుంజుకుంటుందన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను యాదవులకు కేటాయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాలలో యాదవులు జనాభా అధికంగా వున్నందున కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఎంపీ, ఎమ్మెల్యే స్థానం యాదవులకు కేటాయించాలని ఎపి యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుర్లు ఆనంద్‌యాదవ్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రాజంపేట ఎంపి స్థానాన్ని గాని, మదనపల్లి అసెంబ్లీ స్థానాన్ని కానీ యాదవులు కేటాయించలేదని తెలిపారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీట పెద్దలు గుర్తిం చాలని సుంచించారు. అన్ని పార్టీలు కూడా యాదవులను అణగద్రొక్కె ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి దశలో నడిపిన వ్యక్తులలో రఘువీరారెడ్డి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో వున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో యాదవులు అధిక జనాభా ఉన్నప్పటికీ తగిన పదవులు లభించడం లేదన్నారు. రాజంపేట ఎంపీ స్థానాన్ని, మదనపల్లి అసెంబ్లీ స్థానాన్ని యాదవులకు కేటాయించే విధంగా అదిష్టానానికి సిపార్సు చేయాలని కోరారు.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

కడప అర్బన్ : ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, కౌన్సిల్ సభ్యులు రాళ్లపల్లి అబ్దుల్లా పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్‌లో విద్యాశాఖలో నిర్వహించిన బదిలీలలో ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు, ఎంఇఒ-2లకు పిజిటిలుగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు అందలేదని చెప్పారు. వీరందరికీ వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు నాగ భూషణం మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్‌ను వెంటనే రద్దు చేసి ఒపిఎస్‌ను మాత్రమే అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు కమల్ బాషా, శివరామకృష్ణారెడ్డి, నరసింహులు, సిద్దయ్య, నాగరాజు, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సిసి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- చిట్వేలి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్‌సిసి ట్రూప్ కమాన్‌డెంట్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా పాఠశాల ఆవరణంలో జరుగుతున్న ఎన్‌సిసి విద్యార్థుల శిక్షణ ఆదివారంతో ముగిశాయి. ఈ సంద ర్భంగా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై ఎన్‌సిసి అధికారి పసుపుల రాజశే ఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేవలం అందం, దుస్తుల బట్టి వ్యక్తి త్వాన్ని అంచనా వేయకూడదని, సమయం, సందర్భం, వ్యక్తులను బట్టి మాట్లాడే విధానం, నిలబడే విధానం, అభిప్రాయాలను వ్యక్తపరిచే విధానం, ఆలోచించే విధానం, నాయకత్వ లక్షణాల మెలుకవలను విద్యార్థి దశ నుండే నేర్చుకునే అవకాశం రావడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో హవల్దార్లు ప్రకాష్ ప్రమోద్, ఉపాధ్యాయులు చంద్రయ్య, దుర్గరాజు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.